క్లుప్తంగా

పరీక్షలు లేకుండా ప్రవేశాలు కల్పించాలి

మిర్యాలగూడ టౌన్: అనాథ పిల్లలకు ఎలాంటి పరీక్షలు లేకుండా గురుకులాల్లో ప్రవేశాలు కల్పించాలని బీసీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు రాపోలు పరమేష్ ప్రభుత్వాన్ని కోరారు. శనివారం మిర్యాలగూడ పట్టణంలోని సంఘం కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. అన్ని వసతులు కలిగిన ప్రభుత్వ పాఠశాలలను గురుకులాలుగా మార్చి అనాథ పిల్లలకు చదువుకునే అవకాశం కల్పించాలన్నారు. సమావేశంలో కోలా సైదులు, పసుల కాశీయాదవ్, తదితరులున్నారు.

కేవీకే శాస్త్రవేత్తకు సన్మానం



కేవీకే శాస్త్రవేత్త భరత్‌ను సన్మానిస్తున్న మార్కెట్ చైర్మన్ చంద్రారెడ్డి తదితరులు

త్రిపురారం: మండల పరిధిలోని కంపాసాగర్‌లో గల కృషి విజ్ఞాన కేంద్రంలో సేద్యపు విభాగం శాస్త్రవేత్తగా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ భరత్ ఖమ్మం జిల్లాలోని మధిరకు బదిలీ అయ్యారు. శనివారం కంపాసాగర్ కేవీకేలో శాస్త్రవేత్త భరత్‌కు తోటి శాస్త్రవేత్తలు, రైతులు, నిడమనూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మర్ల చంద్రారెడ్డి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాసరావు, కేవీకే శాస్త్రవేత్తలు, జిల్లా ఉత్తమ రైతులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామస్థాయిలో బీజేపీ బలోపేతమే లక్ష్యం

త్రిపురారం: గ్రామస్థాయిలో బీజేపీ బలోపేతమే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని పార్టీ రాష్ట్ర నాయకురాలు కవిత, జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు కొండేటి సరిత అన్నారు. శనివారం రాత్రి మండలంలోని పెద్దదేవులపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని నర్లకంటిగూడెంలో ప్రజా గోస-బీజేపీ భరోసా కార్నర్ సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. పేద ప్రజల అభ్యున్నతే ధ్యేయంగా ప్రధాని మోదీ అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో సింగం జ్యోతి, మేధారి సైదులు, అల్లాని జగదీశ్వర్, కందుకూరి సైదులు, గుండెబోయిన వెంకన్న, దామర సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

పీఆర్సీ అమలు చేయాలి



నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న విద్యుత్ జేఏసీ నాయకులు

నిడమనూరు: తమకు రాష్ట్ర ప్రభుత్వం పీఆర్సీ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రంలో విద్యుత్ ఉద్యోగులు శనివారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. పీఆర్సీ ప్రకటించి 11 నెలలు అవుతున్నా ఇంకా తమకు అమలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో విద్యుత్ జేఏసీ నాయకులు సబ్ ఇంజనీర్ జానయ్య, టౌన్ ఏఎల్ఎం సోమవేఖర్, సురేష్, హరికృష్ణ, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన మహాసభలను జయప్రదం చేయాలి



పెద్దవూర: నాయినవానికుంట తండాలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

అడవిదేవులపల్లి: మిర్యాలగూడలో మార్చి 1, 2, 3వ తేదీల్లో నిర్వహించే గిరిజన సంఘం రాష్ట్ర 3వ మహాసభలను విజయవంతం చేయాలని సీపీఎం నాయకులు జటంగి సైదులు, కుర్ర సైదానాయక్ అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో గిరిజన మహాసభల పోస్టర్‌ను వారు ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కుర్ర శివనాయక్, హనుమంతునాయక్, రంగానాయక్, కోటినాయక్, మాజీ ఎంపీటీసీ సర్వయ్య, లలితమ్మ, సైదులు తదితరులు పాల్గొన్నారు.

మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

పెద్దవూర: మిర్యాలగూడ పట్టణంలో నిర్వహించనున్న గిరిజన సంఘం రాష్ట్ర 3వ మహాసభలకు సంబంధించిన పోస్టర్లను శనివారం మండలంలోని నాయనివానికుంటతండాలో సంఘం మండల ఉపాధ్యక్షుడు రమావత్ సీతారాంనాయక్ తదితరులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీకాంత్, శర్మన్, గోలియా, వినోద్, బాలు, రవి తదితరులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా

- అధికారుల మధ్య సమన్వయ లోపం
- అనుమతి ఒక చోట.. తరలింపు మరో చోటుకి



కుర్రంపల్లిలో డంప్ చేసిన ఇసుక

చింతపల్లి: ప్రధాన శాఖల మధ్య సమన్వయ లోపం అక్రమ ఇసుక దందా చేసే వారికి వరంగా మారింది. ప్రభుత్వ అనుమతుల పేరుతో పట్టపగలే పదుల సంఖ్యలో ట్రాక్టర్లలో ఇసుక అక్రమ రవాణా అవుతుందంటే అధికారుల పర్యవేక్షణ ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. గతంలో అర్ధరాత్రి మాత్రమే సాగిన ఇసుక అక్రమ రవాణా ప్రస్తుతం రాత్రి, పగలు తేడా లేకుండా జరుగుతుండడం అధికారుల పర్యవేక్షణ లేమికి నిదర్శనమని మండల ప్రజలు చర్చించుకుంటున్నారు. మండలంలోని కుర్రంపల్లిలో ఓ ప్రజాప్రతినిధి భర్త ప్రభుత్వ అనుమతుల పేరుతో ఇసుక అనుమతులు పొంది పెద్దఎత్తున తన సొంత పొలంలోనే ఇసుక కుప్పలు పోసి ఉన్నా వాటి వైపు అధికారులు కన్నెత్తి చూడడం లేదు. గనులు, రెవెన్యూ, పోలీసు శాఖల మధ్య సమన్వయ లోపమే అక్రమ ఇసుక రవాణాకు కారణమని తెలుస్తుంది. ప్రభుత్వ పాఠశాల నిర్మాణం పేరుతో ఇసుక అనుమతులు పొంది అక్రమ దందాకు కొందరు తెరలేపారు. అక్రమార్కులకు కొంతమంది అధికారులు అండగా నిలవడంతో వందలాది ట్రాక్టర్ల ఇసుక తరలిపోతుందని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇదేంటని ప్రశ్నిస్తే ప్రభుత్వ అనుమతితో అభివృద్ధి పనులకు వినియోగిస్తున్నామని తప్పించుకుంటున్నారు. అక్రమార్కులు యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా చేస్తుండడంతో సామాన్యులకు ఇసుక అందే పరిస్థితి లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కుర్రంపల్లి గ్రామంలో మన ఊరు-మన బడి మొదటి విడతలో భాగంగా చేపట్టిన పాఠశాల భవన నిర్మాణానికి ఇసుక అనుమతి కోసం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు దరఖాస్తు చేసుకోగా తహసీల్దార్ ఇచ్చిన అనుమతి మేరకు ఓ ప్రజాప్రతినిధి భర్త అనుమతులు దుర్వినియోగం చేస్తూ తన వ్యవసాయ భూమిలో ఇసుకను డంప్ చేసి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. మొక్కుబడిగా పాఠశాలకు కొన్ని ట్రాక్టర్ల ఇసుకను తరలించి వందలాది ట్రాక్టర్ల ఇసుకను అక్రమంగా తరలిస్తున్నట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ అనుమతుల పేరుతో ఈ వ్యవహారం అధికారుల కనుసైగల్లోనే జరుగుతుండడం గమనార్హం. గనులు, రెవెన్యూ, పోలీసు అధికారులు ఇసుక అక్రమ దందాపై దృష్టి పెట్టాలని, లేదంటే భూగర్భజలాలు అడుగంటిపోవడంతో పాటు భవిష్యత్తులో ఇసుక దొరకని పరిస్థితి నెలకొంటుందని ప్రజలు వాపోతున్నారు.

ఇసుక అక్రమంగా తరలిస్తే చర్యలు తప్పవు

జిల్లా కలెక్టర్ ఇచ్చిన ఆదేశాల మేరకే ఆయా గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలకు దగ్గర్లో ఉన్న ప్రాంతం నుంచి ఇసుక అనుమతులు పొంది వాడుకోవచ్చు. కుర్రంపల్లి గ్రామపంచాయతీలో మన ఊరు-మన బడి కార్యక్రమంలో భాగంగా నూతనంగా నిర్మించనున్న ప్రభుత్వ పాఠశాల భవన నిర్మాణానికి మాత్రమే ఇసుకను తీసుకునేలా అనుమతి ఇచ్చాం. మరే ఇతర నిర్మాణాలకు కూడా అనుమతులు లేవు. ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే చర్యలు తీసుకుంటాం.

– విశాలాక్షి, తహసీల్దార్, చింతపల్లి

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

- ఎమ్మెల్యే రవీంద్రకుమార్



శ్మశానవాటిక నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రవీంద్రకుమార్

దేవరకొండ: దేవరకొండ మున్సిపాలిటీ పరిధిలో మౌలిక సదుపాయాల కల్పనకు తన వంతు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ తెలిపారు. శనివారం మున్సిపాలిటీ పరిధిలోని 1వ వార్డులో రూ.కోటితో చేపడుతున్న శ్మశానవాటిక నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. పట్టణ ప్రగతిలో భాగంగా అన్ని వార్డుల్లో సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఆయా వార్డుల్లో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, వైస్ చైర్మన్ రహత్ అలీ, కమిషనర్ వెంకటయ్య, కౌన్సిలర్లు పొన్నెబోయిన భూదేవిసైదులు, హన్మంతు వెంకటేష్‌గౌడ్, అంజిగౌడ్, జయప్రకాష్, రయిస్, అశోక్, చిత్రం ప్రదీప్, ఏఊ రాజు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేర నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకం



చిల్కమర్రి గ్రామంలో సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న డీఎస్పీ నాగేశ్వర్‌రావు

పెద్దఅడిశర్లపల్లి: నేర నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకమని దేవరకొండ డీఎస్పీ నాగేశ్వర్‌రావు అన్నారు. శనివారం పెద్దఅడిశర్లపల్లి మండలంలోని చిల్కమర్రి గ్రామంలో స్థానిక సర్పంచ్ కేతావత్ విజయలక్ష్మిమూనా ఆర్థిక సహాయంతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను డీఎస్పీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒక్కో సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమని, ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు దాతలు ముందుకు రావాలని కోరారు. అనంతరం సీసీ కెమెరాల ఏర్పాటుకు ఆర్థిక సహాయం చేసిన సర్పంచ్ కేతావత్ విజయలక్ష్మిమూనాను డీఎస్పీ అభినందించారు. కార్యక్రమంలో కొండమల్లేపల్లి సీఐ రవీందర్, ఎస్‌ఐ రంజిత్‌రెడ్డి, కొర్ర బాలకృష్ణ, మల్లేష్, లోహిత్, రమేష్, రంగా, శేఖర్, రాము, హన్మంతు, లాలయ్య తదితరులు పాల్గొన్నారు.

నిందితుడిపై చర్యలు తీసుకోవాలని వినతి



ఆర్డీఓ కార్యాలయంలో వినతి పత్రం అందజేస్తున్న బంజారా ఉద్యోగుల సంఘం నాయకులు

మిర్యాలగూడ అర్బన్: వరంగల్ జిల్లాలోని కాకతీయ మెడికల్ కళాశాలలో పీజీ చదువుతున్న ధరావత్ ప్రీతి ఆత్మహత్య చేసుకోవడానికి కారకుడైన సీనియర్ సైఫ్‌తో పాటు ఫిర్యాదు చేసినా పట్టించుకోని కళాశాల డైరెక్టర్, ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ బంజారా ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో శనివారం ఆర్డీఓ కార్యాలయ అధికారికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు మాలోతు దశరథ నాయక్ మాట్లాడుతూ.. తనను వేధింపులకు గురిచేస్తున్నారని గత డిసెంబర్‌లోనే ప్రీతి ఫిర్యాదు చేసినా పోలీసులు, కళాశాల యాజమాన్యం పట్టించుకోలేదని ఆరోపించారు. వినతి పత్రం అందజేసిన వారిలో సంఘం నాయకులు లాస్కర్‌నాయక్, మాన్యానాయక్, నీలకంఠంనాయక్, సైదానాయక్, యాదవ సంఘం డివిజన్ నాయకులు చేగొండి మురళీయాదవ్, సురేష్ నాయక్, తదితరులున్నారు.

బీసీ బంధు అమలులో వివక్ష తగదు



కళ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలుపుతున్న బీసీ యువజన సంఘం నాయకులు

మిర్యాలగూడ టౌన్: రాష్ట్రంలో బీసీ బంధు అమలు చేయడంలో సీఎం కేసీఆర్ వివక్ష చూపుతున్నారని ఆరోపిస్తూ శనివారం మిర్యాలగూడ పట్టణంలోని సాగర్ రోడ్డులో గల మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద బీసీ యువజన సంఘం ఆధ్వర్యంలో కళ్లకు గంతలు కట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీసీలను అణగతొక్కాలని చూస్తున్నాయని అన్నారు. అర్హులైన ప్రతి బీసీ కుటుంబానికి బీసీ బంధు కింద రూ.10 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో బీసీలను కేవలం పార్టీ జెండాలను మోసే కార్యకర్తలుగానే చూస్తున్నారని ఆరోపించారు. బీసీలు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా ఎదిగినప్పుడే సమాజంలో గుర్తింపు ఉంటుందన్నారు. బీసీలు ఐక్య ఉద్యమాలు చేపట్టినప్పుడే హక్కులను సాధించుకోగలుగుతామని అన్నారు. కార్యక్రమంలో బీసీ యువజన సంఘం మిర్యాలగూడ అసెంబ్లీ నియోజకవర్గ అధ్యక్షుడు పాలిశెట్టి అజయ్, వేములపల్లి మండల అధ్యక్షుడు చిలకమర్రి ఇంద్రాచారి, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి రాంబాబు, నాయీ బ్రాహ్మణ సంఘం పట్టణ అధ్యక్షుడు నర్సింహ, జానపాటి రవి, గంగాధర్, రుషి, సంతోష్, కార్తీక్, మణి, నవీన్, అబ్బాస్ తదితరులున్నారు.

కుల వృత్తిదారులకు ఎమ్మెల్యే బహిరంగ క్షమాపణ

మిర్యాలగూడ: పట్టణంలోని ఎన్ఎస్పీ క్యాంపు గ్రౌండ్‌లో ఈ నెల 23న దళితబంధు యూనిట్ల పంపిణీ కార్యక్రమంలో కుల వృత్తిదారులపై తాను చేసిన వ్యాఖ్యల పట్ల స్థానిక ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు బహిరంగ క్షమాపణలు చెప్పారు. కుల వృత్తిదారులను కించపరిచే విధంగా తాను మాట్లాడలేదని.. ఎవరికైనా నా మనోభావాలు దెబ్బతింటే క్షమించాలని శనివారం ఆయన ఒక వీడియో విడుదల చేయగా అది సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దళితబంధు యూనిట్ల పంపిణీ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ వేదికపైకి ప్రజాప్రతినిధులను ఆహ్వానించే క్రమంలో ఎంపీపీ, జెడ్పీటీసీ పేర్లు తెలియకపోవడంతో ఎంపీపీ, జెడ్పీటీసీలు వేదికపైకి రావాలని ఆహ్వానించారని ఎమ్మెల్యే వీడియోలో పేర్కొన్నారు. ఆ సమయంలో మిర్యాలగూడ ఎంపీపీ నూకల సరళాహన్మంతరెడ్డి ప్రొటోకాల్ పాటించలేదని ప్రశ్నించడంతో.. ఓ అగ్రకుల ప్రజాప్రతినిధిని మందలించే క్రమంలో చాకలి, మంగలి పనులు నేనే చేయాలా అంటూ ఉచ్ఛరించానే తప్ప బలహీనవర్గాలను కించపరచాలని ఉద్దేశంతో అనలేదని అన్నారు. తాను రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలవడంలో బలహీనవర్గాల పాత్ర ఎంతో ఉందన్నారు. తాను ఏనాడూ కుల వృత్తులను కించపరచలేదని భవిష్యత్తులో కూడా అలా జరగదని చెప్పారు. ఎవరి మనసునైనా నొప్పించినట్లయితే క్షమించాలని ఎమ్మెల్యే కోరారు.

మహిళా రక్షణలో విఫలం

మిర్యాలగూడ టౌన్: తెలంగాణలో మహిళలపై జరుగుతున్న దాడులు, వేధింపులను అరికట్టడంలో కేసీఆర్ ప్రభుత్వం విఫలమైందని బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు కొండేటి సరిత అన్నారు. శనివారం మిర్యాలగూడ పట్టణంలో నిర్వహించిన మహిళా మోర్చా సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. వరంగల్‌లోని కాకతీయ మెడికల్ కళాశాలలో సీనియర్ వేధింపులతో వైద్య విద్యార్థిని ప్రీతి ఆత్మహత్యయత్నానికి పాల్పడితే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు పరామర్శించకపోవడం బాధాకరమన్నారు. తనను సీనియర్ వేధిస్తున్నాడని ప్రీతి ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోలేదన్నారు. ప్రీతి వైద్య ఖర్చులు మొత్తం ప్రభుత్వమే భరించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మహిళా మోర్చా నాయకురాళ్లు పందిరి భాగ్యమ్మ, కంచుకొమ్ముల విజయలక్ష్మి, ధనావత్ సీతమ్మ, రేణుక వెంకటేశ్వరీ, ప్రవంతి, నాగలక్ష్మి, ఈశ్వరమ్మ తదితరులున్నారు.

బాల్య వివాహాలు చేయడం నేరం

మిర్యాలగూడ: బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రజిని అన్నారు. శనివారం మాడ్గులపల్లి మండలంలోని కుక్కడం గ్రామంలో గల కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడుతూ.. బాలికలకు 18 సంవత్సరాలు నిండిన తర్వాతే వివాహాలు చేయాలని సూచించారు. ఆడపిల్లల అక్రమ రవాణా, చిన్నపిల్లల అక్రమ దత్తత, భ్రూణ హత్యలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. బాలికలు కౌమార దశలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో వసంతకుమారి, లలిత, కవిత, రజిత, జ్యోతి, జేబున్నీసా, కల్పన, సునీత, అనూష, జ్యోత్స్న, కల్పన, పరమేశ్వరి, తిరుపతమ్మ, ప్రమీల, కృష్ణవేణి, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు అభినందనీయం

దేవరకొండ: పట్టణంలోని లిటిల్ ఫ్లవర్ అప్పర్ ప్రైమరీ పాఠశాల విద్యార్థులు శనివారం పాఠశాలలో స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని ప్రధాన రహదారిపై మోడల్ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ చలివేంద్రాన్ని సందర్శించిన మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ విద్యార్థులను అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని స్వచ్ఛంద సంస్థలు, వ్యాపార సంస్థలు స్వచ్ఛందంగా ముందుకొచ్చి పట్టణంలో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పొన్నెబోయిన సైదులు, జయప్రకాష్, పాఠశాల నిర్వాహకులు చేరిపల్లి రమ్య, రాజేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పంచాయతీ ట్రాక్టర్ అప్పగింత



ట్రాక్టర్‌ను ఎంపీడీఓ కార్యాలయంలో అప్పగిస్తున్న సర్పంచ్ జగదీశ్వర్‌రెడ్డి

గుర్రంపోడు: గ్రామపంచాయతీ ట్రాక్టర్ నిర్వహణకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడంతో మండలంలోని జూనూతుల గ్రామ సర్పంచ్ కంచర్ల జగదీశ్వర్‌రెడ్డి శనివారం ట్రాక్టర్‌ను ఎంపీడీఓ కార్యాలయంలో మండల పంచాయతీ అధికారి రవికుమార్‌కు ట్రాక్టర్‌ను అప్పగించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. చెత్త సేకరణకు, ఇతర గ్రామపంచాయతీ అవసరాలకు వినియోగిస్తున్న ట్రాక్టర్‌కు ప్రభుత్వం స్టేట్ ఫైనాన్స్ నిధులు విడుదల చేయకపోవడంతో నిర్వహణ భారంగా మారిందని పేర్కొన్నారు. ప్రతి నెలా ట్రాక్టర్‌కు చెల్లించాల్సిన ఈఎంఐని కూడా గ్రామపంచాయతీలకు అందే 15వ ఫైనాన్స్ కమిషన్ నిధుల నుంచి చెల్లించాలని అధికారులు ఒత్తిడి తెస్తున్నారని అన్నారు.

క్రీడాకారులకు అండగా స్పోర్ట్స్ అసోసియేషన్



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎన్‌వీటీ

దేవరకొండ: క్రీడాకారులకు దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ ఎల్లవేళలా అండగా ఉంటుందని అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్‌వీటీ తెలిపారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా రగ్బీ అసోసియేషన్ సహకారంతో దేవరకొండలోని అవుట్ డోర్ స్టేడియంలో నిర్వహించిన జిల్లా స్థాయి అండర్-17 టచ్ రగ్బీ టోర్నమెంట్ శనివారం ముగిసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గెలుపొందిన జట్లకు ఆయన బహుమతులు అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు తాళ్లశ్రీధర్‌గౌడ్, పృథ్వీరాజ్, రమేష్, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

యువజన సంఘం అధ్యక్షుడిగా విజయ్

నాగార్జునసాగర్: నందికొండ మున్సిపాలిటీ బీసీ యువజన సంఘం అధ్యక్షుడిగా కోడె విజయ్ శనివారం పైలాన్ కాలనీలోని బీసీ భవన్‌లో సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి రేపాకుల అంజనేయులుయాదవ్ చేతుల మీదుగా ఆయన నియామకపత్రం అందుకున్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నందికొండ మున్సిపాలిటీ అధ్యక్షుడు మంజుల రామదాసు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

పెద్దవూర: మండలంలోని బసిరెడ్డిపల్లి గ్రామ సర్పంచ్ నరాల కొండయ్య శనివారం గ్రామానికి చెందిన పుట్టపాక లింగయ్య, ఎల్లమ్మ దంపతుల కుమార్తె శ్రీప్రవళిక, కమ్మంపాటి శ్రీను, నాగమ్మ దంపతుల కుమార్తె త్రివేణి వివాహాలకు హాజరై గ్రామ కళ్యాణలక్ష్మి పేరిట రూ.5116ల చొప్పున ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కురాకుల అంతయ్య, ఉప సర్పంచ్ తుడుం అంజయ్య, గోన మోహన్‌రావు పాల్గొన్నారు.

సామూహిక సీమంతాలు

అడవిదేవులపల్లి: మండలంలోని ముదిమాణిక్యం, ఉల్సాయిపాలెం, గాంధీనగర్, బంగారుగడ్డ గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ముదిమాణిక్యం గ్రామ సర్పంచ్ తుమ్మల ఏడుకొండలు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగమణి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పటిష్టతకు కృషిచేయాలి

గుర్రంపోడు: మండలంలో బీఆర్ఎస్ పటిష్టతకు కార్యకర్తలు కృషిచేయాలని పార్టీ నాయకుడు పాశం గోపాల్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని పాశంవారిగూడెంలో జరిగిన బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా చూడాలని అన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ గాలి సరితా, నాయకులు బైరెడ్డి సత్యనారాయణ, వెంకటాపురం అచ్చాలు, వెంకటాపురం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ అనుసంధానం చేసుకోవాలి

తిరుమలగిరి(నాగార్జునసాగర్): జాబ్ కార్డు కలిగిన ప్రతిఒక్కరూ తమ జాబ్ కార్డులకు ఆధార్‌ను అనుసంధానం చేసుకోవాలని ఎంపీడీఓ ఖాజా అస్గర్ అలీ సూచించారు. శనివారం మండలంలోని జాల్‌తండా, నాయకునితండా, నెల్లికల్లు గ్రామాల్లో ఉపాధి హామీ పనులపై కూలీలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. ఉపాధి హామీ పనులకు రాని కూలీల జాబ్ కార్డులను తొలగించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏపీఓ నాగేశ్వరావు, ఈసీ శ్రీరాములు, టీఏ కార్తీక్‌రెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ రేణుక పాల్గొన్నారు.

అనుమతులు లేకుండా నిర్మించొద్దు

కొండమల్లేపల్లి: మండల కేంద్రంలోని శ్రీ సీతారామ చంద్రమౌళీశ్వరస్వామి దేవాలయ ప్రాంగణంలో అనుమతులు లేకుండా ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదని ఆలయ కమిటీకి గ్రామపంచాయతీ కార్యదర్శి వీరబాబు శనివారం నోటీసులు జారీ చేశారు. ఆలయ ప్రాంగణంలో అనుమతులు లేకుండా మడిగెలు నిర్మిస్తున్నారని గతంలోనే హెచ్చరించినా, పట్టించుకోకుండా నిర్మాణాలు కొనసాగిస్తున్నారని, ఇప్పటికైనా అక్రమ నిర్మాణాలు నిలిపివేయాలని లేని పక్షంలో చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని నోటీసులో పేర్కొన్నారు.

బీసీలకు మూడు ఎమ్మెల్సీ స్థానాలు కేటాయించాలి



సీఎం కేసీఆర్‌కు పోస్టు కార్డులు పంపుతున్న బీసీ నాయకులు

మిర్యాలగూడ టౌన్: తెలంగాణాలో త్వరలో భర్తీ చేయనున్న ఐదు ఎమ్మెల్సీ స్థానాల్లో బీసీలకు మూడు స్థానాలను కేటాయించాలని కోరుతూ శనివారం బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్‌కు పోస్టు కార్డులు పంపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీకి మూల స్తంభంగా నిలిచింది బీసీలు మాత్రమేనని, బీసీలకు జనాభా ప్రాతిపాదికన మూడు ఎమ్మెల్సీ స్థానాలను కేటాయించాలన్నారు. చట్టసభల్లో బీసీలకు రాజకీయ రిజర్వేషన్లు లేకపోవడంతో బీసీలు ఎదగలేకపోతున్నారన్నారు. మంత్రి పదవులను కూడా కేవలం మూడు మాత్రమే బీసీలకు ఇవ్వడం జరిగిందన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు బంటు వెంకటేశ్వర్లు, జానపాటి రవి, చెగొండి మురళీయాదవ్, అంజియాదవ్, వెంకటేశ్వర్లు, వంశీ తదితరులున్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి..



హాలియా: పంగవానికుంట ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులతో విద్యార్థులు



మిర్యాలగూడ: దామరచర్ల మండలం కొండ్రపోల్ మండల పరిషత్ పాఠశాలలో..

హాలియా: పట్టణంలో వీఎస్ఆర్ ప్రైమరీ స్కూల్‌లో శనివారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులే ఉపాధ్యాయులుగా, ప్రజాప్రతినిధులుగా, వివిధ శాఖల అధికారులుగా వ్యవహరించారు. అనంతరం పాఠశాల కరస్పాండెంట్ శివర్ల వెంకటయ్య విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సరిత, దుర్గ, అంజలి, సునీత, రహీమ, నాగమణి, నిఖిత, పావని, సబిహ, పద్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

పంగవానికుంట ప్రాథమిక పాఠశాలలో..

అనుముల మండలంలోని పంగవానికుంట ప్రభుత్వం ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన స్వపరిపాలన దినోత్సవంలో విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. అనంతరం ప్రధానోపాధ్యాయుడు దామోదర్‌రెడ్డి విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు సయ్యద్ అహ్మద్, అంగన్‌వాడీ వర్కర్ మంగమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్లోక పాఠశాలలో..

మిర్యాలగూడ టౌన్: పట్టణంలోని శ్లోక పాఠశాలలో శనివారం స్వపరిపాలన దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ మారుతీ అమరేందర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ రంగమణి, డైరెక్టర్ కట్ట అనిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొప్పోలు ప్రాథమిక పాఠశాలలో..

గుర్రంపోడు: మండలంలోని కొప్పోలు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శనివారం స్వపరిపాలన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ అన్నెపర్తి శివాజీ శర్మ విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం కె. వెంకట్‌రెడ్డి, టీచర్లు శ్రీదేవి, సునీత, పరిపూర్ణ, పి. లక్ష్మి, కె. లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కొండ్రపోల్ మండల పరిషత్ పాఠశాలలో..

మిర్యాలగూడ: దామరచర్ల మండలంలోని కొండ్రపోల్ మండల పరిషత్ పాఠశాలలో శనివారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీనివాస్‌నాయక్, ఉపాధ్యాయులు వేణుధర్, మీనాక్షి, పద్మ, వహీదా, సలీమా, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బట్టుగూడెం ప్రాథమిక పాఠశాలలో..

పెద్దవూర: మండలంలోని బట్టుగూడెం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శనివారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉత్తమ ప్రతిభ కనపర్చిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు అనురాధ, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మడమడక ప్రాథమిక పాఠశాలలో...

దేవరకొండ: మండల పరిధిలోని మడమడక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శనివారం స్వపరిపాలన దినోత్సవాన్ని విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తరగతులు నిర్వహించారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం రమావత్ స్వామినాయక్, ఉపాధ్యాయులు బలరాం, రాజశేఖర్, పాల్గొన్నారు.



దేవరకొండ: మడమడక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులతో ఉపాధ్యాయులు



పెద్దవూర: బట్టుగూడెం ప్రాథమిక పాఠశాల విద్యార్థులతో ఉపాధ్యాయులు



గుర్రంపోడు: కొప్పోలు ప్రాథమిక పాఠశాలలో పరీక్ష ప్యాడ్‌లతో విద్యార్థులు